# "ప్రశ్నించినందుకే అరెస్టు.. ఇదేనా ప్రజాస్వామ్యం?"

**--'లిక్కర్ కమిషన్, గ్రావెల్ దోపిడీని ఎండగట్టినందుకే కక్ష" - డొక్కరి దానయ్య**

**--"108 కు ఫోన్ చేసిన వ్యక్తిపై హత్య కేసా?" - మందస ఎంపీపీ ఆగ్రహం**

**-"అప్పలరాజు అరెస్టు బీసీ ఆత్మగౌరవంపై దాడి"**



**మందస, జూలై 27:** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ కక్షసాధింపుతో బనాయించిన తప్పుడు కేసు అని మందస మండలం ఎంపీపీ డొక్కారి దానయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మందసమండలం కిల్లోయి గ్రామంలో శనివారం జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయని ఆరోపించారు. "ఈ మధ్యకాలంలో లిక్కర్ బాటిల్ పై 10 నుండి 20 రూపాయల వరకు కమిషన్ దందా నడుస్తోంది. గ్రావెల్ కొండలను కొండలే అమ్మేస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమించుకుంటున్నారు. భూ అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఈ అక్రమాలన్నింటినీ బహిరంగంగా డాక్టర్ గారు ప్రశ్నించినందుకే ఈ అక్రమ అరెస్టు చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యంలో అధికారాలు శాశ్వతం కావని, ప్రభుత్వాలు మారడం సహజమని గుర్తు చేశారు. "అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకులపై కక్ష కట్టి అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం" అని పేర్కొన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పినట్లుగా "ఏది విత్తితే అదే కోయాల్సి వస్తుంది" అనే సామెతను ఉదహరిస్తూ, పలాస నియోజకవర్గంలో రాజకీయ ద్వేషం, కక్షసాధింపు అనే విష సంస్కృతికి బీజం వేశారని ఆరోపించారు. "వారు నాటిన ఈ విష బీజాల ఫలితాలను భవిష్యత్తులో తప్పకుండా అనుభవిస్తారు" అని హెచ్చరించారు.రాజకీయాల్లో పోటీ అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఉండాలని, ప్రజా సమస్యలపై ఉండాలని సూచించారు. "కానీ ఇక్కడ ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను జైళ్లకు పంపించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. మాజీ మంత్రి అప్పలరాజు గతంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు మరచిపోతారని భావించి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోంది. అయితే ఆయన అరెస్టు తర్వాత ప్రజలు ఆయన సేవలను మరింతగా గుర్తు చేసుకుంటున్నారు. రోడ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు, ఇళ్ల నిర్మాణం... ప్రతి అంశంలో ఆయన కృషి కనిపిస్తోంది" అని తెలిపారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అప్పలరాజుకు సమాచారం అందడంతో ఆయన మానవతా దృక్పథంతో వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లారని వివరించారు. "అంతకుముందే ఆయన కుటుంబ సభ్యులు 108 అత్యవసర సేవలకు సమాచారం ఇచ్చారు. ఒక వ్యక్తి హత్య చేయాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తే 108కు సమాచారం ఇస్తారా? గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తారా? ఈ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. ఈ అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున కేసు వివరాలపై మరింత వ్యాఖ్యానించడం సమంజసం కాదని అన్నారు.గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో గానీ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎన్ని కేసులకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 105 కింద హత్య కేసులు నమోదు చేశారో ప్రభుత్వం వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేశారు. "అప్పలరాజు విషయంలోనే ఎందుకు ఈ వివక్ష? ఇది కచ్చితంగా రాజకీయ కుట్రే" అని అన్నారు.బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఒక బీసీ నాయకుడైన డాక్టర్ సీదిరి అప్పలరాజును లక్ష్యంగా చేసుకోవడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా మొత్తం బీసీ వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. "ఒక బీసీ నాయకుడిపై ఇలా కక్ష కట్టడం వల్ల బీసీ వర్గాల్లో తీవ్ర ఆగ్రహం ఉంది. దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదు" అని స్పష్టం చేశారు.ప్రతిపక్ష నాయకులను అణచివేయడం కంటే ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. "లేదంటే ప్రజలు తగిన సమయంలో తీర్పు ఇస్తారు. ప్రజా సేవ చేసిన నాయకుడిగా చరిత్రలో నిలవకుండా ఒక్కసారే ఎమ్మెల్యేగా మిగిలిపోతారని" ఎమ్మెల్యే శిరీషకు హితవు పలికారు.ఈ సమావేశంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దల్లి జానకి రెడ్డి, జడ్పీటిసి సవరచంద్రమ్మ, అగ్గున్న సూర్యనారాయణ, సొర్ర ఢిల్లీ రావు, అందాల శేషగిరి, మార్పు వెంకటరమణ, నాగేశ్వరావు, డాక్టర్ మట్ట జయరాం, దున్న హరికృష్ణ, పులారి పితంబరం, సేనాపతి కిషోర్, బత్తిని వెంకట్రావు, బత్తిని లక్ష్మణరావు, సవర రాము, ఎంపీటీసీలు, సర్పంచులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పలాస.. శివాజీ నగర్ షిరిడి సాయి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు

**- భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు**



**పలాస, జూలై 27:** గురువు పట్ల భక్తి, కృతజ్ఞత, శరణాగతిని చాటే పవిత్ర పర్వదినమైన గురు పౌర్ణమిని పురస్కరించుకుని పలాస పట్టణం శివాజీ నగర్, ఆర్.టి.సి. కాంప్లెక్స్ సమీపంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 29న బుధవారం మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ నిర్వాహకులు దువ్వాడ శ్రీధర్ బాబా తెలిపారు.గురు పౌర్ణమి రోజున భక్తులు తమ గురువులను పూజించి ఆశీర్వాదం తీసుకోవడం సనాతన సంప్రదాయం. ఈ నేపథ్యంలో శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో, రంగోలీలతో అందంగా అలంకరిస్తున్నారు. ఉదయం 5:15 గంటలకు పవిత్ర కాకడ ఆరతితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 6:00 గంటలకు బాబా వారికి మంగళస్నానం నిర్వహించి, భక్తుల చేతుల మీదుగా మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేస్తారు. 7:00 గంటలకు స్వామి వారికి నూతన వస్త్రాలంకరణ, కిరీటధారణ, ప్రత్యేక అలంకరణ కార్యక్రమం ఉంటుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉదయం 11:30 గంటలకు భారీగా మహా అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించేందుకు వసతులు కల్పించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు మధ్యాహ్న ఆరతి, సాయంత్రం 6:15 గంటలకు ధూప్ ఆరతి, రాత్రి 9:00 గంటలకు శేజ్ ఆరతితో గురు పౌర్ణమి వేడుకలు ముగుస్తాయి.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలన్నీ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ధర్మపురి వాయునందన శర్మ గారి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణలు, భజనల మధ్య జరుగుతాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో తాగునీరు, కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా పలాస, కాశీబుగ్గతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో శ్రీ షిరిడి సాయి భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై మహా అన్నప్రసాదాన్ని స్వీకరించి, శ్రీ షిరిడి సాయిబాబా వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని, గురు పౌర్ణమి మహోత్సవాలను విజయవంతం చేయాలని దువ్వాడ శ్రీధర్ బాబా విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవి




TELANGANA JAGRUTHI

శ్రీమతి కల్వకుంట్ల కవిత,
వ్యవస్థాపకులు మరియు చైర్ పర్సన్
తెలంగాణ జాగృతి

040 - 2351 1111 telanganajagruthi@gmail.com

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవి ని నియమిస్తూ తెలంగాణ జాగృతి ఫౌండర్ చైర్‌పర్సన్ కల్వకుంట్ల కవిత ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై కల్వకుంట్ల కవిత ఫౌండర్ చైర్‌పర్సన్‌గా కొనసాగనుండగా, రాష్ట్ర అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవి బాధ్యతలు స్వీకరించనున్నారు.


# కాలనీ సమగ్రాభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకం

**- బిఆర్‌ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్, నవతరం:** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సూరారం డివిజన్ లక్ష్మి నగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్‌ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన నామిరెడ్డి అమృత, ప్రధాన కార్యదర్శి హరి శంకర్ రావులతో పాటు నూతన వెల్ఫేర్ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, లక్ష్మీ నగర్ తో పాటు నియోజకవర్గంలోని అనేక కాలనీలు, బస్తీలలో కోట్లాది రూపాయల నిధులతో మౌలిక వసతులను అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా లక్ష్మీ నగర్ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొండకల్ల యాదిరెడ్డి, కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి, కోల శ్రీకాంత్ ముదిరాజ్, వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు సురేష్, కె. రాఘవేందర్ రెడ్డి, ఇంద్రసేన, ప్రభు లింగం, కె.వి. రమణ, ఏ. వెంకటేశ్వర్ రావు, సభ్యులు సాయి ప్రేమ్, వెంకటప్ప , ప్రసాద్ రెడ్డి,ఎన్. యశ్వంత్ రెడ్డి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలేవి...?







**సైబరాబాద్, నవతరం:** కుత్బుల్లాపూర్ జోను గాజులరామారం సర్కిల్ పరిధిలోని లెనిన్ నగర్ లో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి. ప్రధానంగా రోడ్ నెంబర్ 14 బి బ్లాక్లో వెలుస్తున్న ఓ ప్రధాన బిల్డర్ కి సంబంధించి స్థానికంగా ఉన్న నాయకుడు వత్తాసు పలుకుతున్నట్టు తెలుస్తుంది. ఇవన్నీ చూస్తుంటే కూడా ఇక్కడ గెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు ఆయన గారు వత్తాసు పలుకుతున్నట్టు విశ్వసిన్య సమాచారం. ఎంత జరుగుతున్న స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రమత్తులో ఎందుకు ఉన్నారంటే వాళ్లకు పుట్టాల్సిన ముడుపులు మొట్టాయి అంటున్నారు ఇక్కడ జనం. అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో ఇక్కడ వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక జనం డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక చోటామోటా నాయకులు ఈ అక్రమ నిర్మాణాలపై ఆధారపడకుండా ప్రజాసేవలు చేస్తే బాగుంటుందని అందరూ అభిప్రాయపడుతున్నారు. లేదంటే ఎక్కడి అక్రమ నిర్మాణాలపై సైబరాబాద్ ముంచిపల్ కమిషనర్ కి ఫిర్యాదు చేయడానికి స్థానికంగా ఉన్న సామాజిక కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు.

# నాయకులగూడెంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**





**సుజాతనగర్,నవతరం :** కొత్తగూడెం కార్పొరేషన్ 21వ డివిజన్ పరిధిలోని నాయకులగూడెంలో సుమారు 80 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కు 21వ డివిజన్ కార్పొరేటర్ దంపతులు చింతలపూడి శ్రావణి - సాయి కుమార్ శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం కార్పొరేటర్ శ్రావణి సాయి కుమార్ మాట్లాడుతూ, డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు విషయంలో ప్రత్యేక కృషి చేసిన ఎమ్మెల్యే కి డివిజన్ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డివిజన్‌లోని పలు సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, మునిసిపల్, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు, వివిధ పార్టీల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

